ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామి, నవగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజ, శిఖర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, గౌతమ్ గౌడ్, దాత్రినాథ్ గౌడ్, ప్రకాష్‌నగర్ కాలనీ అధ్యక్షులు చింతకింది పవన్ గౌడ్, నరేందర్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



శ్రీకృష్ణుడి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి గోకుల్‌నగర్‌కు చెందిన ఎట్టయ్య, దేవకుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని రథోత్సవం, దేవేంద్రుడి ఉత్సవం నిర్వహించారు. డివిజన్ పరిధిలో పలుకాలనీల మీదుగా రథం సాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నేత నీలం మధు, పార్టీ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి, కర్ణాటకకు చెందిన మల్లికార్జున్ అప్పాజీతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కర్ర పూజ



ఆల్విన్‌కాలనీ: రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఈ నెల 27 నుంచి నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్వామిని నెలకొల్పే షెడ్డుకు ఆదివారం కర్ర పూజ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, జలంధర్ రెడ్డి, గణేష్ యూత్ కమిటీ సభ్యులు భార్గవ్, నందు, రిత్విక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ కార్నివాల్



రాయదుర్గం: హానర్ వివాంటీస్ స్పోర్ట్స్ కార్నివాల్–2025 క్రీడోత్సవాలు ముగిశాయి. విజేతలకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ఈ పోటీలలో హానర్ వివాంటీస్ అపార్ట్‌మెంట్లలో నివాసముండే 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

టేబుల్‌టెన్నిస్‌లో అండర్–14 బాలురలో గోయల్, బాలికల్లో ఆర్నాగోయల్, మెన్స్ సింగిల్‌లో శ్రీనివాసరావు, నితిన్‌కుమార్, డబుల్స్‌లో శుభాన్షుగుప్తా, ఫణీంద్ర, విమెన్స్ కేటగిరిలో విష్ణుప్రియ విజేతలుగా నిలిచారు. చెస్ పోటీలలో వివిధ కేటగిరిలలో అథర్వ్‌జగ్లాన్, శ్రేష్ఠ, మానస్‌పాండే, స్వీటీజగ్లాన్, బాలాజీప్రసాద్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ . స్విమ్మింగ్ ,లాన్‌టెన్నిస్‌లో పలువురు విజేతలుగా నిలిచారు.

వాంబే కాలనీలో డ్రైనేజీ సమస్య



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి వాంబే కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి మురుగు నీరు ఇళ్లల్లోకి ప్రవహించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పట్టించుకోవాలని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నర్సింహ,అరవింద్, మున్నీర్, రవి, స్వామి, సాగర్ రాజు, పాషా, కాలనీవాసులు పాల్గొన్నారు.

కుంటకు కళొచ్చేనా..



గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లో రామమ్మకుంట

'నిథమ్ రామమ్మకుంట'ను పరిశీలించిన హైడ్రా కమిషనర్

చిగురిస్తున్న ఆశలు

రాయదుర్గం: నగరంలోని చెరువులు, కుంటలను సుందరీకరిస్తున్న నేపథ్యంలో గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) క్యాంపస్‌లోని రామమ్మకుంటను కూడా సుందరీకరించాలని ప్రతిపాదించారు. నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లో ఉంది. ఇటీవల నిథమ్ డైరెక్టర్ ప్రొ.వెంకటరమణ విజ్ఞప్తి మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ రామమ్మకుంటను పరిశీలించడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది.

చెరువు అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు..

- చెరువుకట్టపై చుట్టూరా వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు
- చెరువు చుట్టూరా లైటింగ్.. చెరువులో ఫౌంటేన్ల ఏర్పాటు, బోటింగ్ సౌకర్యం కల్పించేందుకు కూడా ప్రణాళిక రూపొందించి పెట్టారు.
- చెరువు వద్ద రకరకాల మొక్కలు నాటాలని అందులో ప్రధానంగా నక్షత్ర, రాశుల మొక్కల పెంపకం
- అంతేకాకుండా 12 రకాల రాశుల మొక్కలతో రాశుల వనం ఏర్పాటు
- హైడ్రా కమిషనర్, నిథమ్ డైరెక్టర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు అయితే ఇక రామమ్మకుంట దశ తిరిగినట్లేనని అభిప్రాయ పడుతున్నారు.

అర ఎకరం విస్తరణ

- రామమ్మకుంట విస్తీర్ణం మూడున్నర ఎకరాలు ఉండగా మరో అర ఎకరం స్థలం కేటాయించి దీన్ని విస్తరించారు.
- దీంతో నగరంలో విస్తీర్ణం పెరిగిన ఏకైక చెరువుగా దీన్ని నిథమ్ రామమ్మకుంటలో నాలుగేళ్ల క్రితం ఎన్విరాన్‌మెంటలిస్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో 20 రోజులు పూడికతీయించి 30 ఫీట్ల వరకు నీరుండేలా సిద్ధం చేశారు.
- ముఖ్యంగా క్యాంపస్‌తో పాటు చుట్టూరా ఉండే కాలనీలలో కూడా భూగర్భ జలాలు పెరిగాయి.

మూతలు విరిగి.. కుంగిపోయి..



మియాపూర్ కృషినగర్ వద్ద మ్యాన్‌హోల్ మూత పగిలిపోయిన దృశ్యం



గోకరాజు రంగరాజు కళాశాల రోడ్డులో కుంగిపోయిన మ్యాన్‌హోల్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

మియాపూర్ : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మూతలు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో, కృషినగర్ కాలనీలో, మయూరినగర్, గోకరాజు రంగరాజు కళాశాల రోడ్డులో మ్యాన్‌హోల్స్ మూతలు పగిలిపోగా కొన్నిచోట్ల కుంగిపోయాయి. అసలే వర్షాకాలం ..వర్షపునీరు వరదలై రోడ్లపై పారుతుంది. ఎక్కడ ఏ మ్యాన్‌హోల్ నోరు తెరుచుకుని ఉందో తెలియని పరిస్థితి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులు కావడంతో వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ ఎక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని భయపడుతున్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు యుద్ధప్రాతిపదికన కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.కృషినగర్ కాలనీ వద్ద ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ మూతలు నాలుగు నెలల్లోనే పలుమార్లు ధ్వంసమైపోగా మరమ్మతులు చేశారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో త్వరగా పగిలిపోతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 60 , బెండ 50, కాకర 40, దొండ 30, దోస 30, ఆలు 30, చామ 40, కీర 30, బీర 40, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 30(కేజీ), క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 150.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్ గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, చైతన్య నగర్‌లోని మహాదేవుని ఆలయం, జె.పి కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానంలో శ్రావణ మాసం చివరి సోమవారంను పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు మహేష్, ఓంకార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సోమవారం ఉదయం 5 గంటల నుండి 7:00 వరకు స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు.

రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆందోళన

శంషాబాద్ రూరల్: నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని కేబీ.దొడ్డి నుంచి రాయన్నగూడ వెళ్లే మార్గంలో సుమారు కి.మీటరు దూరం వరకు రోడ్డు విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. శంషాబాద్–మొయినాబాద్ మండలాలను అనుసంధానం చేసే ఈ రహదారిలో అడుగడుగునా గుంతలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ ఈ రోడ్డుపై విద్యార్థులు, రైతులు, ఉద్యోగులతో పాటు స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. గుంతలు, వరదనీరు నిలవడంతో ప్రయాణం నరకంగా ఉందన్నారు. వాహనాలు మరమ్మతులకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రహదారిపై దీక్ష చేస్తామని హెచ్చరించారు.

మల్టీ జనరేషన్ పార్క్ ప్రారంభం



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో రూ.3కోట్ల 61లక్షలతో చేపట్టిన మల్టీ జనరేషన్ పార్క్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మయూరినగర్‌లో సకల సౌకర్యాలతో పార్క్‌ను కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అలాగే సులువుగా రాకపోకలు జరిగేలా సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

24న మెగా రక్తదాన శిబిరం

రాయదుర్గం: దేశంలోనే అతిపెద్ద రక్తదాన శిబిరం –2025ను గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ క్యాంపస్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24వ తేదీ ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. 18 ఏళ్లు పైబడి వారు, ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయడానికి ముందుకురావాలని నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9396503335, 040–23001234లలో సంప్రదించాలి.

రాజీవ్ యువవికాసం | రుణాల పంపిణీపై సందిగ్ధత

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం.. యువత ఎదురుచూపులు

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దరఖాస్తులు సమర్పించి సుమారు నాలుగు నెలలు కావస్తోన్నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో రాయితీ రుణాలతో స్వయం ఉపాధి పొందుదామనుకున్న యువత ఆశలు అడియాశలవుతున్నాయి. కాగా జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాయితీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉండగా చివరలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రాయితీ రుణాల పంపిణీపై సందిగ్ధత నెలకొనడంతో దరఖాస్తుదారులు జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం మొత్తం 36,728 మంది దరఖాస్తు చేసుకున్నారు. ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత 6,366 దరఖాస్తులు ఎంపికయ్యాయి. వీటన్నింటినీ సంబంధిత అధికారులు ఆయా బ్యాంకులకు పంపించారు. బ్యాంక్ అధికారులు వీటిని మళ్లీ స్క్రూటినీ చేసి అర్హత ఉన్నవారికే రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. కాగా ఈ ప్రకియ నిలిచిపోయింది.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే షేక్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో 53,656 మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల ధృవపత్రాలను స్క్రూటినీ చేసిన అనంతరం 8,776 మంది దరఖాస్తులు అర్హతకు నోచుకున్నాయి.
- యువ వికాసం పథకానికి ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం రూ.50,000ల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీ రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించడంతో చాలామంది రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్లకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. దరఖాస్తులను ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల్లో అధికారులు పరిశీలించారు. చివరకు దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, రుణ బకాయిలను తనిఖీ చేసి ఇచ్చిన నివేదికలు, స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన లబ్ధిదారుల జాబితా ఆధారంగా మండల, జిల్లా స్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేయాల్సి ఉండగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది.తాత్కాలికంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. తదుపరి ఆదేశాల మేరకే లబ్ధిదారుల ఎంపిక జరగనుంది.

రసోల్లాస్ నృత్యోత్సవం





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన రసోల్లాస్ నృత్యోత్సవం సందర్శకులను అలరించింది. సాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి నృత్య గురువు రమాదేవి పాల్గొన్నారు. భరతనాట్య ప్రదర్శనలో దెబ్జాని చటర్జీ మీరా భజన, ఠాగూర్ సంగీత గీతం, డాక్టర్ మధుసూదన్ భరతాంజలి, కృష్ణగాథ, శ్రీరామచంద్ర కృప అంశాలను ప్రదర్శించారు. భరతనాట్య ప్రదర్శనలో శబ్దం, తిల్లాన అంశాలను రమ్య ప్రదీప్ ,డాక్టర్ అతిరా, సౌమ్య రామస్వామి.. కృష్ణ జననశబ్దం, కళింగ తిల్లాన అంశాలను ప్రదర్శించారు. నాట్యకళా కుశల సాగర అవార్డు 2025ను పియాల్ భట్టాచార్యకి ఇచ్చి సత్కరించారు. ఎస్పీ భారతి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



శ్మశానవాటికలో అభివృద్ధి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో హిందు, క్రిస్టియన్ శ్మశాన వాటికల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ,జీహెచ్‌యంసి అధికారులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో నిర్మిస్తున్న బర్నింగ్ ప్లాట్‌ఫాం, సిట్టింగ్ గ్యాలరీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించడంతో బాటు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అదే విధంగా వాచ్‌మెన్ రూమ్, పూజా గదులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, సత్యరాజు, దేవదాస్, సుమన్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, యూబీడీ సూపర్‌వైజర్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రాయదుర్గం: గౌలిదొడ్డిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం యాగశాల పూజలు, సర్వతోభద్ర మండలపూజ, మహాలక్ష్మీ హవనం, విశేష చండీహోమం పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్థాపిత మండప పూజ, రుద్రహోమం, నవదుర్గ హోమం, కళాన్యాస హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఫల, పుష్ప శయ్య ధాన్య, ఆదివాసం వంటి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

గౌలిదొడ్డిలో సోమవారం రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. ఆలయంలో ఉదయం యాగశాల పూజలు, స్థాపిత మండపపూజ, ప్రాణప్రతిష్ఠ హోమం, శాంతిహోమం, మహాపూర్ణాహుతి, అమ్మవారి యంత్ర ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ రేణుక అమ్మవారికి ప్రాణ ప్రతిష్ఠ, కళాన్యాసం, కుంభ ప్రోక్షణ, దిష్టికుంభం, సాత్విక బలిహరణ వంటివి నిర్వహిస్తారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనం సమర్పిస్తారు.

చెత్త.. ఎక్కడికక్కడ గుట్టలుగా

● హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ వెంబడి, ఫ్లైఓవర్ కింద చెత్త పారబోత ● దుర్వాసన



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద పేరుకుపోయిన చెత్త

చందానగర్ : చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారాయి. ఓవైపు వర్షాలు కురుస్తుండడంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెలువడుతోంది. పరిసరాల శుభ్రతపై జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితం లేదు. న్యూహఫీజ్‌పేట్ ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ బస్తీలకు మధ్య ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద, హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో చెత్త వేస్తున్నారు. పలువురు ద్విచక్ర వాహనాలపై చెత్త తీసుకువచ్చి ఫ్లైఓవర్ కింద వేస్తున్నారు. దీంతో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తీయకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. స్థానికులు, వాహనదారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద పేరుకుపోయిన చెత్త చెదారంతో దోమలు, ఈగలతో అనారోగ్యం పాలవుతున్నాం. ఇక పక్కనే ఉన్న మురుగు నీటి కాలువలో కూడా చెత్త వేస్తుండడంతో వాసన తట్టుకోలేక పోతున్నాం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదిత్యనగర్ బస్తీ నుంచి వెళ్ళే నాలా పక్కన చెత్త చెదారం

